క్లుప్తంగా

ఇంటిపై కూలిన తాటిచెట్టు



కోడూరు: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా వీచిన ఈదురుగాలులకు తాటిచెట్టు కూలి ఓ ఇంటిపై పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని ఉల్లిపాలెం గ్రామంలో ఒడుగు పున్నారావు కుటుంబ సభ్యులతో కలిసి రేకుల షెడ్డులో నివాసముంటున్నాడు. సోమవారం ఉదయం 7గంటల సమయంలో భారీ ఈదురుగాలులు వీయడంతో పక్కనే ఉన్న తాటిచెట్టు పున్నారావు ఇంటిపై పడింది. దీంతో గోడలు, రేకులు పూర్తిగా దెబ్బతిన్నాయి. చెట్టు పడిన సమయంలో ఇంట్లో పున్నారావు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే రేకుల కింద ఇనుప కడ్డీలు ఉండడంతో వాటిపై చెట్టు పడి ఆగిపోయింది. దీంతో లోపల ఉన్న చిన్నారులకు ప్రమాదం తప్పింది. రెవెన్యూ అధికారులు ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు.

ఎర్రజెండానే దేశానికి దిక్సూచీ



మోపిదేవి: రానున్న రోజుల్లో ఎర్రజెండానే దేశానికి దిక్సూచీ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. కమ్యూనిస్టు నేత, మోపిదేవి మాజీ సర్పంచ్ కంఠంనేని అచ్యుతరామయ్య 13వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ 17 సంవత్సరాల పాటు ఏకగ్రీవ సర్పంచ్‌గా పరిపాలన సాగించి కమ్యూనిస్టుల పాలన ఏ విధంగా ఉంటుందో అచ్యుతరామయ్య చేసి చూపించారని గుర్తు చేశారు. తిరుమల లడ్డూలో కల్తీనెయ్యి కలిసిందని ప్రకటిస్తున్న చంద్రబాబు ఆ కల్తీ చేసినవారిని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం పేరుతో మత రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నారని, బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాలు రాష్ట్రంపై పడుతున్నాయని, చంద్రబాబు జాగ్రత్త పడాలని సూచించారు. తొలుత పార్టీనాయకులు, కార్యకర్తలు మోపిదేవి ప్రధాన సెంటర్‌లో అమరవీరుల స్థూపం వరకు ర్యాలీగా వెళ్లి నివాళులర్పించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రామారావు, విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రాఘవేంద్రరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య, గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి, జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, మహిళా జిల్లా అధ్యక్షురాలు మల్లుపెద్ది రత్నకుమారి, విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ చెన్నం కోటేశ్వరావు, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు, అచ్యుతరామయ్య చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపిక



చల్లపల్లి(అవనిగడ్డ): జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు చల్లపల్లి శ్రీచైతన్య స్కూల్ విద్యార్థిని గూడపాటి ఏక్తాప్రియ ఎంపికై నట్టు ప్రిన్సిపాల్ డి.సురేష్ తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో అండర్-14 (18 నుంచి 20) కిలోల విభాగంలో ఏక్తాప్రియ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఏక్తాప్రియ, కోచ్‌లు కె.సుబ్బు, ఎస్.జాహ్నవిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

వ్యక్తికి గాయాలు

పెడన: మండల పరిధిలోని మడక పెట్రోల్ బంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన వివరాల మేరకు..మచిలీపట్నం బలరామునిపేటకు చెందిన వ్యక్తి తీవ్రంగా గాయపడగా 108లో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్కూటీని మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టిన ఈ ఘటనపై పోలీసు కేసు నమోదు కాలేదు. ఆసుపత్రి అవుట్ పోస్టు పోలీసుల నుంచి సమాచారం వస్తే కేసు ఫైల్ చేస్తామని పెడన పోలీసులు తెలిపారు.

చెత్త సేకరణకు ఆయిల్ సమస్య

- నిలిచిన చెత్త సేకరణ వాహనాలు
- పెట్రోల్ బిల్లు చెల్లించకపోవటంతో ఇబ్బందులు
- మొత్తం 41 వాహనాలకుగాను 24 డిపోకే పరిమితం
- జటిలమవుతున్న పారిశుద్ధ్య సమస్య

మచిలీపట్నంటౌన్: ఆయిల్‌కు చెత్త సేకరణకు ఏమిటి సంబంధం అనుకుంటున్నారా..నిజమేనండి..రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో నగరంలో పారిశుద్ధ్య నిర్వహణకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్లాప్ కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేసిన చెత్త సేకరణ వాహనాలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఫలితంగా వాహనాలు ముందుకు సాగని పరిస్థితులు నెలకొన్నాయి. అలాగే వాహనాలపై పనిచేస్తున్న డ్రైవర్లు, సూపర్‌వైజర్లకు రెండు నెలలుగా జీతాలు పడని పరిస్థితి నెలకొంది.

నిలిచిన చెత్తసేకరణ వాహనాలు..

నగరంలో 41 డివిజన్లలో క్లాప్ ప్రోగ్రాం ద్వారా ఏర్పాటు చేసిన చెత్త సేకరణ వాహనాలు చెత్తను డంపింగ్‌యార్డుకు చేరవేస్తుంటాయి. ఇందుకోసం మొత్తం 41 వాహనాలు ఉన్నాయి. అయితే వీటికి పెట్రోల్ పోయించేందుకు కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవటంతో సమస్య ఎదురైంది. నగరంలో సోమవారం 24 వాహనాలకు పెట్రోల్ లేకపోవటంతో డిపోకే పరిమితమయ్యాయి. 17 వాహనాలు మాత్రమే పనిచేశాయి. ఈ వాహనాలకు ప్రతి శనివారం పెట్రోల్‌ను ఫుల్ ట్యాంకు చేస్తారు. ఈ ఆయిల్‌తో ఈ వాహనాలు వారం మొత్తం పనిచేస్తాయి. పెద్ద వార్డుల్లో తిరిగే వాహనాలకు ఆయిల్ అయిపోవడంతో అవి డిపోకే పరిమితమయ్యాయి. మిగిలిన 17 వాహనాలు చిన్నవార్డుల్లో తిరిగే వాహనాలు మాత్రమే సోమవారం చెత్తను తరలించాయి.



డిపోకే పరిమితమైన చెత్త తరలింపు వాహనాలు (ఇన్‌సెట్) నగరంలో కొరవడిన పారిశుద్ధ్యం

నేడు మరి కొన్ని..

మంగళవారం మరికొన్ని వాహనాలు నిలిచిపోనున్నాయని తెలిసింది. ఫలితంగా కార్మికులు ఊడ్చిన చెత్తతో పాటు ఇంటింటి నుంచి సేకరించిన చెత్త డంపింగ్‌యార్డుకు తరలించటంలో ఇబ్బంది ఏర్పడి 24 డివిజన్లలో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి రీసైక్లింగ్‌కు సహకరించాలని కలెక్టర్ డీకే బాలాజీ ఇటీవల వీడియోను విడుదల చేశారు.

10 డివిజన్లకు ప్రత్యేక అధికారి..

ప్రతి 10 డివిజన్లకు జిల్లాస్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించారు. వీరు పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలి. అయితే చెత్తను సేకరించే వాహనాలకే పెట్రోల్ అందించలేని పరిస్థితి నెలకొనటంతో రానున్న రోజుల్లో నగరంలో పారిశుద్ధ్య పరిస్థితి ఏమిటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రెండు నెలలుగా జీతాల్లేవ్..

నగరంలో చెత్తసేకరణ చేస్తున్న 41 వాహనాలకు డ్రైవర్లు ఉన్నారు. వీరికి నెలకు రూ.14,700 జీతంలో కటింగులు పోను రూ.12,500 ఇవ్వాల్సి ఉంది. అయితే రెండు నెలలకుపైగా జీతాలు లేకుండా పోయాయి. వీరిపై పర్యవేక్షణకు ఇద్దరు సూపర్‌వైజర్లు ఉన్నారు. వీరికి నెలకు రూ.16000 వంతున జీతం మూడు నెలల 15 రోజులకు రావాల్సి ఉంది. వాహనాలకు పెట్రోలు పోయించలేని పరిస్థితి, సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవడం తదితర సమస్యలతో పారిశుద్ధ్య సమస్య జటిలం కానుంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించకపోతే నగర ప్రజలకు ఇబ్బందులు తప్పవు.

పంట నమోదు చేసిన రైతుల జాబితా ప్రదర్శన

ఘంటసాల: పంటలు సాగుచేస్తున్న రైతుల వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నోటీసు బోర్డుల్లో సోమవారం ఉంచామని ఎంఏవో కె.మురళీకృష్ణ తెలిపారు. మండలంలో 2024 ఖరీఫ్ పంట కాలంలో 13 రైతు సేవా కేంద్రాల పరిధిలో 19,389 ఎకరాల్లో సాగు చేస్తున్న పంటలు, రైతుల వివరాలను ఈ క్రాప్ నమోదు చేసినట్లు చెప్పారు. రైతు సేవా కేంద్రాల పరిధిలో సాగు చేసిన పంటలు, రైతుల సమాచారం ముసాయిదా జాబితాను ఆయా రైతు సేవా కేంద్రాల్లో నోటీసు బోర్డులో ప్రదర్శించినట్లు చెప్పారు. ఈ జాబితాలపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 16 లోపు రైతులు అర్జీ రూపంలో అధికారులకు తెలపాలన్నారు. ఆయా సమస్యలను పరిశీలించిన అనంతరం 18వ తేదీ తుదిజాబితా విడుదల చేస్తామన్నారు. తుదిజాబితా ఆధారంగా రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ జరుగుతుందని ఏవో మురళీ కృష్ణ తెలియజేశారు.

బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ

పెడన: పల్లె ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయడానికి సప్తగిరి గ్రామీణ బ్యాంక్ సంస్థ పనిచేస్తోందని సప్తగిరి బ్యాంక్ చైర్మన్ ఏఎస్ఎన్.ప్రసాద్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బల్లిపర్రు గ్రామంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు శాఖను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు అందిస్తున్న సేవలను వివరించారు. రీజినల్ మేనేజర్లు జేవీఎంవీ ప్రసాద్, శ్రీరామ్, బ్రాంచ్ మేనేజర్ రాజ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఈదురు గాలులు.. కుండపోత వర్షం

పల్లపు ప్రాంతాలు జలమయం

మచిలీపట్నంటౌన్: జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో సోమవారం అల్పపీడన ప్రభావంతో కుండపోత వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి చెదురుమదురుగా వర్షం కురుస్తూనే ఉంది. సాయంత్రం 4 గంటల తరువాత ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై కుండపోత వర్షం కురిసింది. దాదాపు గంటసేపు ఎడతెరిపి లేకుండా వర్షం కురవటంతో నగరంలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లోని రహదారులు జలమయమయ్యాయి. ప్రధాన డ్రెయిన్లతో పాటు కచ్చా డ్రెయిన్లు పొంగి రోడ్లపై ప్రవహించాయి. అదే సమయంలో విద్యా సంస్థలు, కార్యాలయాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

కమ్మిన మబ్బులు..

పెడన: పట్టణంతో పాటు మండల ప్రాంతంలో సోమవారం వేకువజాము నుంచి వర్షం కుమ్మరించింది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం కారణంగా పెడనలో ఉదయం నుంచి రాత్రి వరకు కారుమబ్బులు కమ్మాయి. చినుకు పడుతూనే అడపాదడపా వర్షం కుమ్మరించింది. పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో జనజీవనం స్తంభించిపోయింది.

ఎడతెరపి లేని వర్షం..

కోడూరు: అల్పపీడన ప్రభావంతో సోమవారం ఈదురుగాలులతో కుండపోత వర్షం కురిసింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఓ మోస్తారు వర్షం ప్రారంభమై సోమవారం ఉదయానికి భారీ వర్షం కురిసింది. అక్కడ నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. వర్షం ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అంబటి బ్రహ్మణయ్య కాలనీ, వీవర్స్‌కాలనీ, యర్రారెడ్డివారిపాలెం, వడ్డెరకాలనీ ప్రాంతాల్లో రహదారులపై వర్షం నీరు నిలిచింది. పల్లపు ఇళ్లలోకి నీరు చేరింది. ప్రధాన రహదారులపై కూడా వర్షం నీరు నిలవడంతో వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మందపాకల, లింగారెడ్డిపాలెం, వి.కొత్తపాలెం, పిట్టల్లంక గ్రామాల్లో అంతర్గత రహదారులు బురదకయ్యలను తలపిస్తున్నాయి.



జలమయమైన నారాయణపురం రోడ్డు



పెడనలో దట్టంగా కమ్ముకున్న మబ్బులు

జిల్లా విజన్ ప్లాన్ల పురోగతిపై సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సోమవారం జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల కార్యదర్శులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వర్ణ ఆంధ్రప్రదేశ్- 2047 విజన్ డాక్యుమెంట్ తయారీ పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ డీకే బాలాజీ కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లాకు సంబంధించి డిస్ట్రిక్ట్ విజన్‌ప్లాన్ పురోగతిని సీఎస్‌కు వివరించారు. జిల్లాలో మండల్ విజన్ ప్లాన్‌లు పూర్తి చేసి నిర్దేశించిన పోర్టల్‌కు అప్‌లోడ్ చేశామన్నారు. జిల్లా విజన్ ప్లాన్ తయారీ కోసం, అన్ని లైన్ డిపార్ట్‌మెంట్ల నుంచి డేటా సేకరించామన్నారు. జిల్లా ప్రొఫైల్ తయారు చేసినట్లు, రాబోయే ఐదేళ్ల కోసం వివిధ రంగాల వారీగా లక్ష్యాల అంచనా ఖరారు చేశామన్నారు. డిస్ట్రిక్ట్ విజన్ ప్లాన్- 2024 అక్టోబర్ 18 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జేసీ గీతాంజలిశర్మ, సీపీవో గణేష్‌కృష్ణ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

పింఛన్లు ఇచ్చి ఆదుకోండి

డీఆర్వోకు సమస్యను వివరించిన పేర్ని కిట్టు

చిలకలపూడి(మచిలీపట్నం): చిన్నాపురం పంచాయతీ పరిధిలో లేవలేని స్థితిలో ఉన్న వారికి పింఛన్లు ఇచ్చి ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) కోరారు. ఈ మేరకు సోమవారం 'మీ కోసం' కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావుకు అర్జీ ఇచ్చారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ చిన్నాపురంలో ఇరువురు, కృష్ణానగర్‌లో ఇరువురు లేవలేని పరిస్థితిలో ఉన్నారని, గతంలో వీరికి పింఛన్లు అందేవన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీరికి రూ.15 వేలు అందజేస్తామని చెప్పి ఇంటికి తాళం వేసి ఉందని సాకులు చెప్పి పింఛన్లు నిలిపివేశారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలైనప్పటికీ ఒక్క నెల కూడా వీరికి పింఛన్లు అందజేయలేదన్నారు. వీరికి వెంటనే పింఛన్లు అందజేసి ఆదుకోవాలని ఆయన కోరారు. దీనిపై స్పందించిన డీఆర్వో చంద్రశేఖరరావు డీఆర్డీఏ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెంటనే విచారణ జరిపి వారికి న్యాయం చేయాలని సూచించారు. పేర్ని కిట్టు వెంట జక్కుల ఆనందబాబు, మునిసిపల్ కో ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, చిన్నాపురం పంచాయతీ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ జంపాన సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.



డీఆర్వో చంద్రశేఖరరావుకు సమస్యను వివరిస్తున్న పేర్ని కిట్టు

'పల్లె పండుగ'లో రోడ్లకు శంకుస్థాపన

కృత్తివెన్ను: గ్రామీణాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పల్లెపండుగ కార్యక్రమంతో గ్రామాలలో అంతర్గత రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని మాట్లాం, నిడమర్రు పంచాయతీలలో పల్లెపండుగ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మాట్లాం గ్రామంలో రూ.31.90 లక్షలు, నిడమర్రు పంచాయతీలో రూ.45 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మాట్లాం, నిడమర్రు సర్పంచ్‌లు టి.పాండురంగారావు, బి.మహాలక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈఈ నగేష్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కోనేరుసెంటర్: బందరు మండలంలో పల్లెపండుగ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు మండలంలోని పెదపట్నం, కానూరు, గోకవరం, సిరివెళ్ళపాలెం, తపసిపూడి, మంగినపూడి గ్రామాల్లో సిమెంట్‌రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. గోపు సత్యనారాయణ, ఆయా గ్రామాల టీడీపీ, జనసేనపార్టీ నాయకులు, కార్యకర్తలు, టీడీపీ సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, గ్రామ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.



నిడమర్రు పంచాయతీలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కేపీ

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని లంకమ్మ మాన్యంలో రూ.2.04కోట్లతో చేపట్టనున్న 30 సీసీ రహదారులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం శంకుస్థాపన చేశారు. లంకమ్మ మాన్యంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.30.68 కోట్ల వ్యయంతో 496 సీసీ రహదారులు నిర్మించనున్నట్టు చెప్పారు. సర్పంచ్ గొరుముచ్చు ఉమా, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు గుడివాక శేషుబాబు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ డీఈ సురేష్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ద్వాదశ ప్రదక్షిణాలు

బంటుమిల్లి: శ్రీ దేవీనవరాత్రి పూజల్లో భాగంగా స్థానిక రామాలయంలో ఆదివారం రాత్రి ద్వాదశ ప్రదక్షిణాలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి భక్తులు ఆలయం చుట్టూ 12 ప్రదక్షిణాలు చేశారు. పండితులు పవన్‌కుమార్, వేణుగోపాలాచార్యులు వేద మంత్రాల మధ్య భక్తులు పలు రకాల ప్రదర్శలు చేస్తూ పల్లకీని మోశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఉత్సవమూర్తులను ఊయలలో ఉంచి పలు రకాల పాటలతో ఊంజల సేవ నిర్వహించారు. దంపతులకు తాంబూలాలు పంచిపెట్టారు.

ఘనంగా అమ్మవారి గ్రామోత్సవం

మండల పరిధిలోని జానకీరామపురం గ్రామంలో దేవీనవరాత్రుల సందర్భంగా పూజలు అందుకున్న అమ్మవారి విగ్రహాన్ని ట్రాక్టరుపై ఉంచి రావులపాలెంకు చెందిన కళాకారుల వేషధారణలతో, కేరళ డప్పు వాయిద్యాలతో, డీజే పాటలతో భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



బంటుమిల్లి రామాలయంలో ఉత్సవమూర్తులతో ద్వాదశ ప్రదక్షిణాలు చేస్తున్న భక్తులు

ఘనంగా అమ్మవారి విగ్రహం ఊరేగింపు

పెడన: శ్రీదేవీ నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలోని 15వ వార్డులో కనకదుర్గమ్మ అమ్మవారి ప్రతిమను నిలిపారు. నవరాత్రులు శనివారంతో ముగియగా సోమవారం అమ్మవారి ప్రతిమ వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు మేళతాళాలతో భక్తుల నృత్యాల నడుమ జరిపారు. మత్స్యకారులు ఏర్పాటు చేసిన ఈ విగ్రహం ఊరేగింపు అనంతరం రామరాజు చానల్‌లో నిమజ్జనం చేశారు.



పెడన పట్టణంలో ఊరేగుతున్న అమ్మవారు

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవిలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా 10 రోజుల పాటు విశేష పూజలందుకున్న దుర్గమ్మ తల్లిని ప్రత్యేక వాహనంపై ఊరేగింపుగా కృష్ణానదికి తరలించారు. సోమవారం సాయంత్రం మేళతాలాలు, డప్పుకళాకారుల సందడి, యువకుల కేరింతల మధ్య అమ్మవారిని ఊరేగింపుగా మోపిదేవివార్పు వద్ద కృష్ణానదిలో నిమ్మజనం చేశారు. దారిపొడవున అమ్మవారికి భక్తులు హారతులు పట్టి అమ్మవారి దీవెనలు అందుకున్నారు.

20న ఉచిత కంటి వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగాయలంకలోని మారుతీ విద్యానికేతన్ డిజిటల్ స్కూలు ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు ఈ శిబిరం ఉంటుందన్నారు. నేత్ర వైద్య పరీక్షల వివరాల కోసం సెల్ 94906 36466, 70936 17778 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. శుక్లాలు ఉన్న వారికి కంటి లోపల అద్దాలు అమర్చే ఆపరేషన్‌లు (ఐఓఎల్) శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని శేఖర్ పేర్కొన్నారు.

పట్టాభిషేకం విగ్రహాల ప్రతిష్ఠ



ఘంటసాల: స్థానిక సత్రవు సెంటర్‌లో శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంపై శ్రీరాముల వారి పట్టాభిషేకం ఘట్టానికి సంబంధించిన విగ్రహాల ప్రతిష్ఠోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం మాట్లాడుతూ ఘంటసాల గ్రామానికి చెందిన తాతినేని వీరయ్య చౌదరి జ్ఞాపకార్థం సతీమణి జయలక్ష్మి రూ.లక్ష, ఆలయం తరపున మరో రూ.20 వేలతో మొత్తం రూ.1.20 లక్షలతో శ్రీరాముల వారి పట్టాభిషేకం ఘట్టానికి సంబంధించిన 14 విగ్రహాలను ఏర్పాటు చేశామన్నారు. అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ బాధ్యతల స్వీకరణ

ఘంటసాల: కేవీకే పరిధిలో రైతులకు విస్తృత సేవలు అందించేందుకు కృషి చేస్తానని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా సుధారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉయ్యూరు చెరకు పరిశోధన స్థానంలో సీనియర్ శాస్త్రవేత్తగా పని చేస్తున్న సుధారాణి బదిలీపై ఘంటసాల కేవీకేకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేవీకే శాస్త్రవేత్తల సమన్వయంతో రైతులకు మెరుగైన సేవలను అందిస్తామన్నారు. రైతులకు మేలైన విత్తనాలు అందించడంతో పాటు సస్య రక్షణ, సస్య పోషణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తామన్నారు. కేవీకేలో విడతల వారీగా నిర్వహించే శిక్షణలను రైతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సుధారాణికి శాస్త్రవేత్తలు, సిబ్బంది సాదర స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించారు. కేవీకే శాస్త్రవేత్తలు వి.మంజువాణి, బి.నవీన్, జి.కృష్ణవేణి, ఎం.వెంకటలక్ష్మి, సుబ్బారెడ్డి, సాయి, తదితరులు పాల్గొన్నారు.



కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సుధారాణికి శుభాకాంక్షలు తెలుపుతున్న శాస్త్రవేత్తలు, సిబ్బంది

రూ.25 లక్షలతో మండలంలో అభివృద్ధి పనులు

మోపిదేవి: 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.25 లక్షలతో మండలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2018లో ఆగిన ప్రభుత్వ గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో తాగునీటి సమస్య పరిష్కరించాల్సి ఉందన్నారు. పెదకళ్లేపల్లి పీహెచ్‌సీలో పాముకాటు విరుగుడుమందు లేదని డాక్టర్ హారిక తెలిపారు. 11వ నంబర్ కాలువ ఆయకట్టు కింద 11/3 అడపావారిపాలెం, అయోధ్య గ్రామాల్లో వరిపంటకు నీరు చేరడం లేదని ఎంపీటీసీ కడవకొల్లు సీతారామాంజనేయులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కె.కొత్తపాలెం, బండికోళ్లంక గ్రామాలలో కొత్తగా అంగన్‌వాడీ సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు కోరారు. మండలంలో 15 అంగన్‌వాడీ కేంద్రాలను మోడల్ కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాలని కోరారు. మినీ గోకులం కింద 146 అర్జీలు అందినట్లు, ఆర్ అండ్ బీ, డ్రెయినేజీ అధికారులు హాజరు కాకపోవడంపై నోటీసులు జారీచేసినట్లు ఎంపీడీవో జె.స్వర్ణభారతి వివరించారు. నడకుదుటి జనసీకుమారి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎంపీపీ దుర్గావాణి, జెడ్పీటీసీ సభ్యులు మల్లిఖార్జునరావు, అధికారులు